క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సబ్ స్టేషన్ 11 కేవీ గాంధీనగర్ ఫీడరు పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని టౌన్ ఈఈ పి.రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర రత్న రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, నారా వారి వీధి, గల్లావారి వీధి, హిందీ స్ట్రీట్, జ్ఞానో లీవ్ స్ట్రీట్, ఫిల్మ్ చాంబర్ స్ట్రీట్, అన్నపూర్ణ రోడ్డు, జమీందారు స్ట్రీట్, సన్యాసి రాజు స్ట్రీట్, రైల్వే స్టేషన్ రోడ్డు, గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్‌వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుర్గంధం వెదజల్లుతున్న మరుగుదొడ్లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అల్లూరి సీతారామరాజు వంతెన దుర్గాపురం శానిటరీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌లు దుర్గందం వెదజల్లుతున్నా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్లుకు కనీసం వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే నీటి పైపులు కూడా లేవు. దీంతో ఎవరికి వారు పనికానిచ్చేసి వెళ్లిపోతున్నారు. ఇక్కడ శుభ్రం చేసేవారే కరువవ్వటంతో దుర్వాసన వెదజల్లుతూ ఉంది. దీనివల్ల అంటు వ్యాధులు ప్రభలుతాయేమోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే పక్కనే ఉన్న శానిటరీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షపు నీటితో రాకపోకలకు అవస్థలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):దేవీనగర్ రైల్వేట్రాక్ సమీపంలోని బ్రిడ్జి వద్ద కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోతుంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రాకపోకలకు వాహన చోదకులు నరకయాతన పడతున్నారు. గుంతలలో వర్షపునీరు నిలిచిపోవటంతో తరచూ వాహన చోదకులు గాయాల బారిన పడతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సాయం కోసం ఎదురు చూపులు



పాయకాపురం(విజయవాడరూరల్): వరద బాధితులు ప్రభుత్వ ఆర్థిక సహాయం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మొదటిగా 17వ తేదీన బాధితులకు సహాయం అందచేస్తామని ప్రకటించింది. తర్వాత 25వ తేదీన ఆర్థిక సహాయం అందిస్తుందని ప్రకటించడంతో బుధవారం పాయకాపురం, కండ్రిక, రాజీవ్ నగర్, ఉడాకాలనీ, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో బాధిత కుటుంబాలు వారికి దగ్గర్లోని వార్డు సచివాలయాల వద్దకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. కొండంత ఆశతో వచ్చిన బాధితులు నిరాశతో వెనక్కి వెళ్లారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాకు 24 మంది క్రీడాకారుల ఎంపిక



నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అండర్ – 19 కేటగిరీ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక కార్యక్రమం బుధవారం జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్, ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ కొత్తపేట నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి 24 మందిని ఎంపిక చేశారు. వెయిట్ 30 నుంచి 95 కేజీల బేసిక్‌గా క్రీడాకారుల ఎంపికలు కోచ్ ద్వారా జరిగినట్లు పీఈటీ విజయ్‌వర్మ తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వీఎంసీని అగ్రస్థానంలో నిలపాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలక సంస్థను అగ్రస్థానంలో నిలపాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం సాయంత్రం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై మినిస్ట్రీఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ రూపా మిశ్రా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా నగర పాలక సంస్థలు చేయవలసిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన చర్యలపై మిశ్రా కమిషనర్‌కు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో గుర్తించిన క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్ (సీటీయూఎస్ అనగా తరచుగా పరిశుభ్రం చేయవలసిన ప్రదేశాలు) త్వరితగతిన పరిశుభ్రపరచాలని, క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్‌ని మూడు విధాలుగా విభజించి, లో–మీడియం, మీడియం– మీడియం, హై మీడియంలుగా గుర్తించి అందుకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకుని అనుకున్న కాల పరిమితిలో వాటిని పరిశుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. స్వచ్ఛత హీ సేవాలో భాగంగా సెల్ఫీ పాయింట్స్‌ని పెట్టి ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వభావం స్వచ్ఛత, సంస్కారం స్వచ్ఛతతో సెల్ఫీ పాయింట్స్ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, స్వచ్ఛ సర్వేక్షణ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు కిట్లు పంపిణీ



వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపుకు గురైన బాధితులకు కేర్ టు యాక్షన్ స్వచ్ఛంద సంస్థ (మురళీ కృష్ణ ట్రస్ట్) ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు, విద్యా కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ వెంకటస్వామి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఐదు వేల మంది అనాథలు, వితంతువులు వారి కుటుంబాలకు తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. 1100 మంది పిల్లలను ఉచితంగా చదివిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అర్జున్ మాట్లాడుతూ.. నగరంలో వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన 570 బాధిత కుటుంబాలను గుర్తించి వారికి నిత్యవసర సరుకుల కిట్లను, వరదల వల్ల పుస్తకాలు పోగొట్టుకున్న 470 మంది పిల్లలకు విద్యా కిట్‌లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన స్పాన్సర్లు, దాతలు, కేర్ టు యాక్షన్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ఉధృతితో సర్వం కోల్పోయిన బాధితులకు గుంటూరు గోరంట్ల ఏఆర్‌టీ సెంటర్, విజయవాడ ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యాన ఫీడ్ మే నేషన్ సహకారంతో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్ కోడిరెక్కల రత్నం, సిస్టర్‌లు కవిత, సుగుణ మాట్లాడుతూ వరద బాధితులకు తమవంతు సాయంగా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ఆపద సమయంలో ఎవరికివారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం 200 మందికి నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయవాడ ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్‌లు కె.లక్ష్మణరావు, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌లో వరద ముంపునకు గురైన విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నగరంలోని అనేక ప్రాంతాలు వరద ముంపునకు గురైన ఘటనలో ఎంతో మంది నష్టపోయినట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లోని విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేలా నగర పాలకసంస్థ అధికారులు పాఠ్యపుస్తకాలను అందించారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ ఉద్దంటి వేదవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆ కళాశాల ఫార్మస్యూటికల్ అనాలసిస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి విద్యార్థినులు మహిళలకు అవగాహన కలిగించారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ మదర్ థెరిస్సా జంక్షన్, టిక్కిల్‌రోడ్డు ప్రాంతాల్లో కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, సమన్వయకర్త పి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని టేనర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో బుధవారం మత్తు పదార్థాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి మాట్లాడుతూ విద్యార్థులు తెలిసో తెలియకో మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, తద్వారా వారు తమ జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితులు గానీ, మరే ఇతర వ్యక్తులుగానీ మాదక ద్రవ్యాలకు ప్రలోభ పెడితే అవి ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశలో ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కుంగిపోతారని వివరించారు. నేర ప్రవృత్తి వైపు కూడా ప్రేరేపిస్తుందని చెప్పారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ఎస్. దేవమణి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన బాలలు, యువతను డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో టేనర్ మెమోరియల్ హైస్కూల్ హెచ్‌ఎం రాజేంద్ర బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావంతులే సైబర్ మోసాలకు గురవుతున్నారు

ఏసీపీ దుర్గారావు



మాట్లాడుతున్న ఏసీపీ దుర్గారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):సమాజంలో బాగా చదువుకున్న విద్యావంతులే ఆన్‌లైన్ మోసాలకు అధికంగా గురవుతున్నారని విజయవాడ వెస్ట్‌జోన్ ఏసీపీ ఎస్.దుర్గారావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కొత్తపేట పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సును బుధవారం ఆ కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ ఎస్.దుర్గారావు మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా మోసాలకు గురవుతూ లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. ఆన్‌లైన్‌లో లోన్లు అందించే యాప్‌లు, ఇతర బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన మోసాలు వంటివి అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. ఏ బ్యాంకూ తమ వినియోగదారుడిని పాస్‌వర్డ్ లేదా ఆధార్, పాన్‌కార్డుల నంబర్లు ఫోన్‌లో అడగవన్నారు. అలాగే తెలియని లింక్‌లు ఫోన్‌లు కనిపించినప్పుడు క్లిక్ చేయకుండా ఉండాలని సూచించారు. యాప్ ద్వారా లోన్లు తీసుకొని పూర్తిగా చెల్లించినా ఇంకా అనేక రూపాల్లో వేదింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని పేర్కొన్నారు. విద్యావంతులైనా చిన్నపాటి అవగాహనా లోపంతో మోసాలకు గురవుతున్నారని వివరించారు. సైబర్ క్రైమ్ సీఐ పలివేల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో రిటైర్డ్ ఉద్యోగులు, మంచి అనుభవం కలిగిన విద్యావంతులు సైతం మోసాలకు గురికావటం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. చిన్నపాటి ఏమరపాటుతో పాటుగా ఆన్‌లైన్‌లో చేస్తున్న లావాదేవీలు అధికారికంగా జరుగుతున్న అంశాలను పరిశీలించకపోవటంతో మోసాలకు గురవుతున్నారని వివరించారు. ఇటీవల వారి దృష్టికి వచ్చిన పలు కేసుల వివరాలను వివరించి విద్యార్థులను చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో కొత్తపేట సీఐ చిన్నకొండలరావు, సైబర్ క్రైమ్ ఎస్ఐ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సేవలు అపూర్వం



వరద బాధిత కుటుంబాలకు సాయమందిస్తున్న మువ్వల శ్రీధర్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత కుటుంబాలకు విశ్రాంత బ్యాంకు ఉద్యోగ సంఘం అందిస్తున్న సేవలు అపూర్వమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజనల్ హెడ్ మువ్వల శ్రీధర్ అన్నారు. ఏపీ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల వరదల వలన నష్టపోయిన బ్యాంకు ఉద్యోగులకు నూతన వస్త్రాలు, వంట పాత్రల పంపిణీ వన్‌టౌన్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి మువ్వల శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన వారిని ఆదుకుని వారు మామూలు జీవితం కొవసాగించేలా తోడ్పడాలన్నారు. సంఘం చైర్మన్ ఎంబీ శంకరరావు మాట్లాడుతూ.. వరదల వల్ల తమ సిబ్బంది విపరీతంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీబీఆర్ఎఫ్ అధ్యక్షుడు బి.వి.వి. కొండలరావు ప్రసంగిస్తూ.. బుడమేరు ముంపు, వరద ఉధృతి వల్ల జల ప్రళయంగా మారి సర్వస్వం కోల్పోయిన వారికి చేయూనందించి ఆత్మస్థైర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్లారావు, అధికారులు శారదామూర్తి, సీతారామారావు, ఐఎస్ఎన్ మూర్తి, రామారావు, సంఘం నేత బీఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనృత్య కళా నిలయానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళా నిలయానికి చెందిన గోనుగుంట శైలశ్రీ శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అభినందించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు కళావేదిక వద్దకు తరలివచ్చారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను భక్తులు అభినందించారు. శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వరద బాధితులపై ఉమా అనుచరుల దాడి హేయం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



మాట్లాడుతున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులపై ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరుల దాడి హేయమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదలకు నగర ప్రజలు సర్వం కోల్పోయి జీవచ్ఛవాలుగా మిగిలారని.. అటువంటి వారిపై దాడికి తెగబడటం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు మాట్లాడే స్వేచ్ఛను కూడా కోల్పోయారని.. పశ్చిమ ప్రాంతంలో ఎన్యుమరేషన్ జరగలేదని రోడ్డెక్కిన భవానీపురం కరకట్టవాసులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారన్నారు. తాజాగా అజిత్‌సింగ్ నగర్‌లో సాయం కోసం వెళ్లిన వ్యక్తిని స్తంభానికి కట్టేసి కొట్టిన ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఓవైపు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ముందుకు వస్తున్న తరుణంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నుకున్న ప్రభుత్వమే తమ గోడు వినకపోతే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మరమ్మతులకు నోచుకోని వాహనాలు

లబోదిబో మంటున్న బాధితులు



స్టార్ట్ కాకపోవటంతో రోడ్లపైనే నిలిచిపోయిన కార్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్):వరద ముంపు వల్ల పాడయిన వాహనాలకు మరమ్మతులు చేసే వారు లేకపోవటంతో వాహన దారులు లబోదిబో మంటున్నారు. వినాయకనగర్ దావు బుచ్చయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ నెల ఒకటో తేదీన వరద నీరు పోటెత్తింది. దీంతో ఎవరికి వారు వాహనాలు వదిలివేసి ప్రాణభయంతో వెళ్లిపోయారు. అయితే వరద నీరు తొలగిన తరువాత చూసుకుంటే ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు మొరాయిస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేసేందుకు మెకానిక్‌లు బిజీగా ఉండటంతో పాటు వరద సాయం కూడా నమోదు చేయకపోవటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మధ్య తరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో వాహనాలను తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవటంతో అధికారులు నమోదు చేయబోమని చెప్పారని వాపోతున్నారు. అలాగే ఇంటి చుట్టూ వరద ముంచెత్తటంతో ఎలుకలు ఇళ్లల్లోకి చేరి ఏసీలు, విలువైన సామగ్రి, ద్విచక్రవాహనాలు, కార్లును పాడు చేశాయి. దీంతో తమ నష్టంను ఎవరు పూరిస్తారో తెలియక నానా యాతన పడుతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఏ నాయకులు, విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) డిమాండ్ చేసింది. నూతన విద్యావిధానం రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన్న, ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్‌కుమార్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో ఉన్నత విద్య నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలో ప్రవేశాలు తగ్గిపోయాయని చెప్పారు. ఉన్నత విద్యనభ్యసించే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయడం జరిగిందన్నారు. దీంతో అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు.

దీనికి సంబంధించిన జీఓ 77ను రద్దు చేసి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. నూతన మెడికల్ కళాశాలలో సీట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మహేష్, అధ్యక్షులు శివ, నాయకులు రాంబాబు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ద్వారా అత్యుత్తమ భవిష్యత్



మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ జీసీ పాండే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్‌సీసీ విద్యార్థులకు అత్యుత్తమ భవిష్యత్ సొంతమవుతుందని 17 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యా సంవత్సరం ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ బుధవారం జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్షలు, రన్నింగ్, వంటి వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించి ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీ పాండే మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ క్రమశిక్షణ, దేశభక్తి ఏర్పడుతుందని చెప్పారు. వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు సైతం లభిస్తాయన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దటానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మరో అతిథిగా హాజరైన హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాలలో అనేక దశాబ్దాలుగా ఎన్‌సీసీ విభాగం కొనసాగుతుందన్నారు. ఎందరో విద్యార్థులను జాతీయ స్థాయిలో ఉన్నతంగా తీర్చిదిద్దిన చరిత్ర కళాశాల ఎన్‌సీసీ విభాగానికి ఉందన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్ మేజర్ మహీందర్‌సింగ్, సుబేదార్ సురేష్ చౌదరి, హవల్దార్ నేత్ర తదితరులు ఎంపిక నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కేపీటీ విజయ భాస్కర్ నిర్వహణలో కార్యక్రమం కొనసాగింది.

• సాయం సరుకులు రోడ్డుపాలు



చెరువుకట్ట పై పారేసిన నిత్యావసర సరుకులు

వరదల కారణంగా సర్వం కోల్పోయి అన్నమో రామచంద్రా అంటున్న బాధితులు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి పలువురు దాతలతో పాటు ప్రభుత్వం కూడా నిత్యావసరాలను అందిస్తోంది. అయితే సక్రమంగా బాధితులకు చేరడం లేదు. పైగా కొంత మంది టీడీపీ నాయకులు వాటిపై పెత్తనం చేస్తూ.. అవి పాడై పోయే వరకూ ఎవరికీ ఇవ్వకుండా, ఆ తర్వాత పారబోస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడకు మూడు విడతలుగా వచ్చిన నిత్యావసరాల కిట్లను గ్రామంలోని టీడీపీ నాయకులు వాటిని పార్టీ కార్యాలయంలో నిల్వ చేశారు. రాజకీయ పార్టీలకతీతంగా బాధితులకు పంపిణీ చేయాల్సిన నిత్యావసర సరుకులను రోజుల తరబడి స్టాకు చేయడంతో కుళ్లి పోయాయి. దీంతో గ్రామంలో పశువుల ఆస్పత్రి రోడ్డు చివరన ఉన్న ఎర్ర చెరువు కట్టరోడ్డుపై పారబోశారు. కుళ్లిపోయిన ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అక్కడ కవర్లలో కనిపిస్తున్నాయి.

– కె.తాడేపల్లి(విజయవాడరూరల్)

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జానకిరామయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జానకి రామయ్య అన్నారు. గాంధీనగర్ శారద కళాశాలలో సైబర్ క్రైమ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జానకిరామయ్య మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరిగినంత వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ, గుజరాత్ వారిచే ఫోరెన్సిక్ సైన్సెస్‌లో ఆన్‌లైన్ తరగతులు ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో సబ్ ఇన్‌స్పెక్టర్ వి.రంభ, వై.బాలరాజాజి, కళాశాల కార్యదర్శి కుందా రామనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ సర్వా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.